నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, సోమవారం 5 ఫిబ్రవరి 2024 KARIMNAGAR




### 40 ఏండ్లు దాటితే స్క్రీనింగ్ చేయించుకోవాలి

40 ఏండ్లు దాటిన ప్రతి మహిళ మూడేళ్లకోసారి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో 30 ఏండ్లు దాటగానే పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటున్నారు. నా దగ్గరకు ప్రసవం కోసం వచ్చే వారి తల్లిని తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నా. ఇప్పటికే పదిమందికి నిర్ధారణ జరిగింది. ప్రాథమిక దశలోనే ఉండడంతో చికిత్స తీసుకోవడంతో తగ్గిపోగా, నాకు ఎంతో తృప్తినిచ్చింది. ఇలా ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

\- డాక్టర్ బోయినపల్లి మాధవి (గైనకాలజిస్ట్)

### రెండు నెలల నుంచి తల తిప్పుతోంది



రెండు నెలల నుంచి కూర్చొని లేవగానే తల తిప్పుతుంది. నడుస్తుంటే కింద పడిపోతున్న ఫీలింగ్ కలిగింది. ఈ రోజు శిబిరానికి రాగానే బీపీ పరీక్షలు చేశారు. బీపీ లెవల్స్ హెచ్చుతగ్గులతోనే తల తిప్పినట్లు అవుతున్నదని చెప్పి మందులు ఇచ్చారు. షుగర్ పరీక్ష సైతం చేశారు. కానీ లేదు. మాలాంటోళ్ల కోసం ఇలాంటి శిబిరాలు నిర్వహించి మందులు ఫ్రీగా అందించడం ఆనందంగా ఉంది. ప్రతిమ వైద్యులకు మేం ఎప్పటికీ రుణపడి ఉంటాం.

\- విరంగి కల్పన, గృహిణి సుభాష్‌నగర్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, తదితరులు

# భయం వద్దు.. ప్రాణాంతకం కాదు

- క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తేనే నయం
- అందరం కలిసికట్టుగా నిర్మూలిద్దాం
- పరీక్షలకు మహిళలు ముందుకురావాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- మాజీ ఎంపీ వినోద్‌తో కలిసి కరీంనగర్‌లో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం ప్రారంభం

విద్యానగర్, ఫిబ్రవరి 4: 'క్యాన్సర్ అనేది ప్రాణాంతక వ్యాధి కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో సాధారణ జబ్బుగా మారిపోయింది. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఈజీగా నయమైపోతుంది. ఈ క్రమంలో అందరం కలిసి వ్యాధిని నిర్మూలిద్దాం' అని అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న శిబిరాన్ని ఉద్దేశించి, ఎమ్మెల్యే మాట్లాడారు. క్యాన్సర్‌ను మొదట్లో నిర్ధారిస్తే వ్యాధి నయం చేసుకోవచ్చని, క్యాన్సర్ అనగానే భావితరం ఏమవుతుందో అనే ఆందోళన నేడు నెలకొందన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచుకొని మొదట్లోనే వ్యాధి నిర్ధారణ చేసుకుంటే నయం చేసుకోవచ్చని తెలిపారు. క్యాన్సర్ పరీక్షలకు మహిళలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు సేవచేసే భాగ్యం వైద్యులకు దక్కిందని, వైద్యులు క్యాన్సర్ నిర్మూలన కోసం అవసరమైతే నిర్బంధ పరీక్ష జరిపి వారి కుటుంబాలను కాపాడాలని కోరారు.



హాజరైన వైద్య సిబ్బంది, ప్రజలు

### సద్వినియోగం చేసుకోవాలి: మాజీ ఎంపీ వినోద్

క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత నిర్ధారణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ సూచించారు. ప్రస్తుత కాలంలో క్యాన్సర్ చాప కింద నీరులా ఎక్కువ మందికి వస్తున్నందున, ఈ ఉచిత శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని, అందుకు కార్పొరేటర్లు, ఇతర నాయకులు కృషి చేయాలన్నారు. 30 ఏండ్ల క్రితం తన సోదరికి ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స అందించామని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె వయస్సు 50 ఏండ్లు అని పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. 20 ఏండ్ల క్రితం తాను ఎంపీగా ఉన్నప్పుడు బసవతారకం హాస్పిటల్ నుంచి భూపాలపల్లికి క్యాన్సర్ నిర్ధారణ కోసం బస్సును తెప్పించామని, పరీక్షలు చేయించినట్లు గుర్తు చేసుకున్నారు. అందులో 12 మందికి నిర్ధారణ కాగా, 8 మందికి ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందించడంతో వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులు ఇప్పటికీ ఫోన్ చేసి నాకు కృతజ్ఞతలు తెలుపడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, సుడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణరావు, కార్పొరేటర్లు వాల రమణ రావు, గుగ్గిల్ల జయశ్రీ, ఎడ్ల సరిత, పిట్టల వినోద, నాంపల్లి శ్రీనివాస్, గంట శ్రీనివాస్, కుర్ర తిరుపతి, ప్రతిమ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ బోయినపల్లి మాధవి, సీనియర్ వైద్యులు డాక్టర్ చెన్నాడి జగన్‌మోహన్‌రావు, చెన్నాడి అమిత్‌రావు, సీఈవో రామచంద్రారావు, పలువురు ప్రతిమ చల్మెడ దవాఖాన వైద్యులు, కొడిమ్యాల ఎంపీపీ స్వర్ణలత, బోయినపల్లి మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత పాల్గొన్నారు.

### క్యాన్సర్ అంటువ్యాధి కాదు



క్యాన్సర్ నిర్ధారణ కాగానే కొంతమంది దానిని అంటువ్యాధిగా భావించి వారిని కుటుంబానికి దూరం పెడుతున్నారు. దీంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. ఫలితంగా రోగ నిరోధకశక్తి తగ్గి, అనారోగ్య సమస్యలు ఎక్కువై ఇబ్బందులు పడుతున్నారు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. వ్యాధి వచ్చిన వారిని ప్రేమగా చూసుకుంటే వారి ఆయుష్షు మరింత పెరుగుతుంది. క్యాన్సర్ రాకుండా 9 నుంచి 14 ఏండ్ల బాలికలకు రెండు డోస్ వ్యాక్సిన్లు. 14 నుంచి 28 ఏండ్ల వాళ్లకు మూడు డోస్ వ్యాక్సిన్ల చొప్పున వేయించుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్లు వేసుకోవడంతో 90% క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు.

\- డాక్టర్ చేతన, (అంకాలజిస్ట్)



### పోటెత్తిన భక్తజనం

మేడారం జాతర సమీపిస్తున్నందున వేములవాడ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారిని సుమారు 50వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.32లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అనుబంధ దేవాలయాల్లోనూ రద్దీ నెలకొన్నది. ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

\- వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4

## కాల్వ గండి పూడ్చివేత



పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 04: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ అనుబంధ గ్రామం దస్తగిరిపల్లి వద్ద 10 ఎల్ ఎస్ఆర్ఎస్పీ కాల్వకు కొందరు రైతులు పెట్టిన గండిని ఆదివారం అధికారులు పూడ్చివేశారు. దీంతో కాలువ ద్వారా దిగువ పొలాలకు నీళ్లు వెళ్తున్నాయి.

# వైద్యులు దైవంతో సమానం

- పేదలకు నాణ్యమైన సేవలందించండి
- ఎంపీ బండి సంజయ్
- కరీంనగర్‌లో ముగిసిన రాష్ట్ర ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సదస్సు



ఎంపీ బండి సంజయ్‌ని సన్మానిస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు

విద్యానగర్, ఫిబ్రవరి 4: సమాజంలో ఏ రంగానికీ లేని గౌరవం ఒక్క వైద్య వృత్తికే ఉందని, అందుకే డాక్టర్లు దైవంతో సమానమని, ప్రత్యక్ష దేవుళ్లుగా భావిస్తూ 'వైద్యో నారాయణోహరి' అని పిలుస్తుంటారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. ఆదివారం కరీంనగర్ బైపాస్ సమీపంలోని వీ కన్వెన్షన్‌లో 9వ తెలంగాణ ఆర్థోపెడిక్ డాక్టర్ అసోసియేషన్ 9వ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ గురువారెడ్డి, బంగారి స్వామి సహా పలువురు డాక్టర్లతో కలిసి బండి సంజయ్ మాట్లాడారు. రాష్ట్ర ఆర్థోపెడిక్ సర్జన్స్ సదస్సును కరీంనగర్‌లో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మామూలుగా ఇలాంటి కాన్ఫరెన్స్‌లు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కత్తా వంటి మెట్రో నగరాల్లో మాత్రమే నిర్వహిస్తారన్నారు. ఢిల్లీ ఎయిమ్స్, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కత్తా వంటి నగరాల్లోని కార్పొరేట్ దవాఖానల్లో పేరుగాంచిన సర్జన్స్ ఇక్కడికి వచ్చి ఆర్థోపెడిక్ రంగంలో వస్తున్న మార్పులు, లేటెస్ట్ టెక్నాలజీ, కొత్తకొత్త సర్జరీ పద్ధతులపై ప్రాక్టికల్‌గా వివరిస్తూ జూనియర్ డాక్టర్లకు అవగాహన కల్పిస్తుండడం గొప్ప విషయమన్నారు. తనకు చాలా బాధ కలిగించే విషయం ఏందంటే కొన్నేండ్లు రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, క్షతగాత్రులు సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు వైద్యం అందించడంలో మీ రోల్ చాలా ముఖ్యమని సూచించారు. అనంతరం ఎంపీ బండి సంజయ్‌ని వైద్యులు ఘనంగా సన్మానించారు. ఇక్కడ తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌భాస్కర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోతీలాల్, ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, రామ్‌రెడ్డి, కుమార్‌గౌడ్ నారగోని, రమాకాంత్ పాల్గొన్నారు.


